ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

కులశేఖరపట్టినంలో

దసరా సంబరాలు

● వైభవంగా శూరసంహార వేడుకలు


శూరసంహారం అనంతరం అమ్మవారికి దీపారాధన

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టినంలో సుప్రసిద్ధ ముత్తారమ్మన్ ఆలయంలో గురువారం రాత్రి శూరసంహార వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయంలో సెప్టెంబరు 23న ధ్వజారోహణంతో దసరా వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆ సందర్భంగా ఆలయంలో కంకణాలు ధరించి వ్రతమాచరించిన భక్తులు ప్రతిరోజూ మహంకాళి, భద్రకాళి, పరమేశ్వరుడు, అంకాళమ్మ తదితర దేవతామూర్తుల వేషాలు ధరించి ఆలయం చుట్టూ ఊరేగి సందడి చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో ప్రతిరోజు వివిధ వాహనాల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో ప్రధానఘట్టమైన మహిషాసుర సంహారం లక్షలాదిమంది భక్తుల నడుమ నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా గురువారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, దీపారాధన చేశారు. వేకువజాము నుంచే వివిధ ప్రాంతాల నుండి ఆలయానికి చేరుకున్న భక్తులు అగ్గి పాత్రలు పట్టుకుని, వంటికి, నోటికి శూలాలు గుచ్చుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. భక్తులు క్యూ లైన్లలో నిలిచి మూలవిరాట్టును దర్శించుకున్నారు. రాత్రి 11 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అలంకార పూజలు చేయగా, రాత్రి 12 గంటలకు అమ్మవారి సింహవాహనంపై ఆసీనులై సముద్రతీరంలోని చిదంబరేశ్వరాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో కాళికాదేవి వేషాలు ధరించిన భక్తులు అమ్మవారి వెంట నృత్యం చేసుకుంటూ ఆలయం వద్దకు చేరారు. అప్పటికే అక్కడి సముద్రతీర ప్రాంతమంతా జనసంద్రంగా మారింది. తొలుత మహిషాసురుడు మూడు సార్లు అమ్మవారికి ప్రదక్షిణ చేసి పోరుకు సిద్ధమయ్యాడు. ఆ తర్వాత అమ్మవారు శూలాయుధంతో మహిషాసురుడిని వధించే ఘట్టం నిర్వహించారు. వివిధ రూపాల్లో పోరుసాగించిన ఆ అసురుడిని అమ్మవారు వధిస్తూ, కోడిపుంజు ఆకారంలో వచ్చిన మహిషాసురుడిని అమ్మవారు శూలాయుధంతో వధించటంతో శూరసంహారఘట్టం ముగిసింది.


సముద్రతీరం వద్ద కాళికాదేవి వేషధారణలో భక్తులు

రాష్ట్రాన్ని వంచించడమే

బీజేపీ ప్రధాన లక్ష్యం

● రామనాథపురం సభలో సీఎం స్టాలిన్


రామనాథపురం సభలో స్వయం సహాయక బృంద సభ్యురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వాన్ని అన్ని విధాలా అణచివేయడమే కేంద్రంలోని బీజేపీ పాలకుల ప్రధాన లక్ష్యంగా ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. రామనాథపురంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమాల్లో రూ.737.88 కోట్లతో పూర్తయిన ప్రభుత్వ పథకాలను ప్రారంభించి, 150 కొత్త పథకాలకు శంకుస్థాపన చేశారు. చివరగా 50,752 మంది లబ్దిదారులకు వివిధ సంక్షేమ పథకాల కింద సహాయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభలో స్టాలిన్ మాట్లాడుతూ జీఎస్టీ అమలుతో హరించుకుపోయిన ఆర్థికపరమైన హక్కులు, నిధుల కేటాయింపులో పక్షపాతం, పాఠశాల విద్య నిధుల నిలిపివేత, ప్రధాని పేరుతో కేంద్రం పేరుతో ప్రకటించే పథకాలకు రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయించాలంటూ నిర్బంధం, ఇవన్నీ చాలక నీట్, జాతీయ విద్యావిధానం పేరుతో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఆటంకాలు కలిగించడం, కీళడి పరిశోధనల ఫలితాలపై నిషేధం, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ఇలా అన్ని రకాలుగా కేంద్ర ప్రభుత్వం వేధిస్తూనే ఉందన్నారు. గత నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో మూడు తుఫానులు, వరదలు సంభవించి తీవ్ర నష్టం జరిగితే ఏ మాత్రం పట్టించుకోకుండా, నిధులు కూడా విడుదల చేయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆగమేఘాల మీద కరూరు వచ్చారని, మణిపూర్‌లో జరిగిన మారణకాండ, గుజరాత్ ప్రమాదాలు, కుంభమేళాలో అపశ్రుతి జరిగినా నిజనిర్ధారణ సంఘాలను పంపని బీజేపీ ప్రభుత్వం రాజకీయ లబ్ది కోసమే కరూరుక నిజనిర్ధారణ సంఘాన్ని పంపిందని ఆరోపించారు. కరూరుకు ఇలా బీజేపీ కూటమి ఎంపీలు, పార్టీల నేతలు పర్యటనకు కారణం అసెంబ్లీ ఎన్నికల సమీపిస్తుండటమేనన్న విషయం రాష్ట్రంలోని సామాన్య ప్రజలందరికీ తెలుసన్నారు. కరూరు సంఘటన సాకుగా పెట్టుకుని రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వాన్ని బెదిరిద్దామా అని ఆలోచిస్తున్నారని, అలాంటి బెదిరింపులకు తమ ప్రభుత్వం గానీ, పార్టీగానీ భయపడే ప్రసక్తేలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత కామరాజర్‌ను హతమార్చేందుకు ప్రయత్నించిన ఆర్ఎస్ఎస్‌ని తెరపైకి తెచ్చేందుకు బీజేపీ పాలకులు ప్రయత్నిస్తున్నారని, రాష్ట్రంలో డీఎంకే మళ్లీ అధికారంలోకి వచ్చి ఈ ప్రయత్నాలను అడ్డుకోవటం ఖాయమని అన్నారు.


దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను అందజేస్తున్న స్టాలిన్

రామనాథపురం జిల్లాకు వరాలు...

రామనాథపురం జిల్లాలో కొన్ని దశాబ్దాల క్రితం తాగునీటి కొరత తీవ్రంగా ఉండేదని, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో ఈ జిల్లాలో పలు మంచినీటి పథకాలు అమలు చేసి ప్రజలకు సక్రమంగా నీరు సరఫరా చేశారని, తమ ప్రభుత్వం కూడా ఈ జిల్లాలో డిసెంబర్‌లోగా 3.82 లక్షలమందికి తాగునీరందించడం కోసం నిర్మిస్తున్న మంచినీటి పథకం అమలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాకు 9 వరాలు ప్రకటించారు. ఆ మేరకు రామనాథపురం మున్సిపాలిటీ పరిధిలోని ఫోర్ వే రోడ్డును రూ.30కోట్లతో సిక్స్ లేన్లగా మార్చనున్నామని, రూ.18కోట్లతో తిరువట్టానై, ఆర్ఎస్ మంగళం యూనియన్లలో ఉన్న 16 ప్రధాన చెక్‌డ్యామ్‌లను మరమ్మతు చేయనున్నామని పేర్కొన్నారు. రామనాథపురంలోని పాత బస్‌స్టేషన్‌ను వాణిజ్య సముదాయంతో కూడిన బస్‌స్టేషన్‌గా అభివృద్ధి పరచనున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, రాజ కన్నప్పన్, పెరియకరుప్పన్, ఎంపీ నవాజ్‌గనీ, శాసనసభ్యులు కాదర్‌బాషా ముత్తురామలింగం, మురుగేశన్, కరుమాణిక్కం, మాజీ మంత్రి అన్వర్‌రాజా, రామనాథపురం జిల్లా కలెక్టర్ సిమ్రన్‌జిత్ సింగ్ కాలోన్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువుల కోసం

ప్రత్యేక వెబ్‌సైట్

● ప్రారంభించిన జీసీసీ మేయర్


వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న మేయర్ ప్రియ

ప్యారీస్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్టమొదటిసారిగా పెంపుడు జంతువులను పర్యవేక్షించేందుకు వాటికి మైక్రో చిప్ అమర్చేందుకు, లైసెన్స్ తదితర సేవలను జతచేస్తూ కొత్తగా రూపొందించిన వెబ్‌సైట్‌ను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) మేయర్ ఆర్.ప్రియ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మీడియాతో మాట్లాడుతూ, నగర పాలక సంస్థల చట్ట ప్రకారం జంతువులను పెంచేందుకు లైసెన్స్ తప్పనిసరని, ఈ విధానాన్ని, సులభతరం చేసేలా 2023 నుండి వెబ్‌సైట్ ద్వారా లైసెన్సుల పంపిణీ జరుగుతోందని, ప్రస్తుతం ఈ సేవల విస్తరణకు జీసీసీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అన్ని రకాల పెంపుడు జంతువులకు మైక్రో చిప్ పొందుపరచాల్సిందిగా వాటి యజమానులకు సూచించామని, ఈ చిప్‌లో యజమాని పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ తదితర వివరాలను రికార్డు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆధునిక సేవలు నగరంలోని ఆరు పెంపుడు జంతువుల చికిత్సా కేంద్రాల్లో ఈ నెల 8వ తేదీ నుంచి ఉచితంగా అందుబాటులో ఉంటాయని, వీటితో పాటు పిచ్చికుక్క కాటుకు ఉచిత ఇంజక్షన్ సౌకర్యం ఉంటుందన్నారు. కుక్కల బెడదకు సంబంధించి '9445061913' అనే వాట్సప్ నెంబర్‌కు, లైసెన్స్ పొందగోరువారు chennai corporation. gov.in అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సిందిగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమరగురుపరన్, సంయుక్త కమిషనర్ జయశీలన్, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

కరూరు దుర్ఘటనపై పిటిషన్ల తిరస్కరణ

● టీవీకే నేతల ముందస్తు బెయిల్ నిరాకరణ

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కరూరులో గత శనివారం టీవీకే నేత విజయ్ నిర్వహించిన రోడ్‌షోలో 41 మంది మృతి చెందిన సంఘటనపై సీబీఐ విచారణ జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను మద్రాసు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ శుక్రవారం ఉదయం తోసిపుచ్చింది. కరూరు రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబీకులకు రూ.50లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లు, రాజకీయ పార్టీల రోడ్‌షోలకు తగిన విధి విధానాలను రూపొందించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. ఆ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాదుల కోరికమేరకు జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో రోడ్‌షోలు నిర్వహించకుండా బెంచ్ నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై రాజకీయ పార్టీలు, సంస్థలు బహిరంగ సభలు, రోడ్‌షోలో నిర్వహించే ప్రాంతాల్లో తాగునీటి సదుపాయం, అంబులెన్స్, మరుగుదొడ్లు తదితర కనీస సదుపాయాలను తప్పనిసరిగా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వానికి (ఆయా ప్రాంతాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులకు) రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని బెంచ్ ఉత్తర్వు జారీ చేసింది. ఇక కరూరు దుర్ఘటనలో మృతుల కుటుంబీకులకు, క్షతగాత్రుల కుటుంబాలకు నష్టపరిహారాన్ని పెంచాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వం, టీవీకే నేత విజయ్ కౌంటర్ అఫిడవిట్లు సమర్పించాలని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఇదే విధంగా మద్రాసు హైకోర్టులో కరూరు దుర్ఘటనకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయమూర్తులు టీవీకే నేత విజయ్‌కి రాజకీయ నాయకత్వ లక్షణాలు ఏవీ లేవని, 41 మంది మృతి చెందిన సంఘటనపై ఇప్పటివరకూ ఆయన ఎలాంటి సంతాపం, విచారం ప్రకటించకపోవడం గర్హనీయమన్నారు.

బుస్సీ ఆనంద్, నిర్మల్‌కుమార్‌లకు బెయిల్ నిరాకరణ...




కరూరులో టీవీకే నేత విజయ్ నిర్వహించిన రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనకు సంబంధించి ఆ పార్టీ నేతలు బుస్సీ ఆనంద్, సీటీఆర్ నిర్మల్‌కుమార్‌కు శుక్రవారం హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో చుక్కెదురైంది. కరూరు దుర్ఘటనకు సంబంధించి కరూరు పోలీసులు వీరిపై నాలుగు సెక్షన్లకింద కేసులు నమోదు చేశారు. అందులో పోలీసులు తమను అరెస్టు చేయకుండా బెయిలు కోరుతూ వారిద్దరూ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్లు వేశారు. ఆ పిటిషన్లు శుక్రవారం ఉదయం విచారణకు వచ్చాయి. ఆ సందర్భంగా పిటిషనర్లు, పోలీసుల తరఫు వాద ప్రతివాదనలు సాయంత్రం వరకు జరిగాయి. చివరకు ఈ పిటిషన్లకు సంబంధించిన న్యాయస్థానం ఉత్తర్వులు కోర్టు సమయం ముగిసిన తర్వాత ఆ కోర్టు వెబ్‌సైట్‌లో వెలువడ్డాయి. ఆ మేరకు బుస్సీ ఆనంద్, సీటీఆర్ నిర్మల్‌కుమార్‌కు బెయిలు నిరాకరించినట్లు హైకోర్టులో ఆ ఉత్తర్వులో పేర్కొంది.

పండుగ పూట విషాదం....

రోడ్డు ప్రమాదాల్లో తల్లి,కొడుకు సహా

ఏడుగురి దుర్మరణం


ప్రమాదానికి గురైన కారు

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దసరా పండుగ రోజున జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా, శుక్రవారం ఉదయం హోసూరు సమీపంలో వాకింగ్‌కు వెళ్లిన తల్లీకొడుకులను మృత్యువు కబలించింది. వివరాలిలా.. చెన్నై నుంచి మూనారుకు కారులో ఐదుగురు యువకులు గురువారం విహారయాత్రకు బయల్దేరారు. విక్రవాండి జాతీయ రహదారిలో వెళ్తున్న కారు, హఠాత్తుగా అదుపుతప్పి సెంటర్ మీడియాను ఢీకొంది. దీంతో కారులో నుంచి మంటలు చెలరేగి, అందులో చిక్కుకుని షంషుద్దీన్, రిషి, మోహన్ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. గాయపడిన అబ్దుల్ అజీజ్, దీపక్‌లను చుట్టుపక్కల వారు రక్షించి ముండియంబాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తిరుచెందూర్ సమీపంలో...

తిరుచెందూర్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ప్రభుత్వ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. కులశేఖరపట్టణం దసరా వేడుకల్లో పాల్గొని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న గురు (25), రంజిత్ (18) మృతిచెందగా, భారత్ (16)కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అక్కడకు చేరుకుని భారత్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని తల్లీకొడుకులు...

హోసూరు సమీపం నల్లకాన్‌కొత్తపల్లి ప్రాంతానికి చెందిన శ్వేతా భాను, కుమారుడు సమీర్ (15)తో కలసి రోజు ఉదయం వాకింగ్‌కు వెళుతోంది. శుక్రవారం ఉదయం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి పక్కన వాకింగ్ చేస్తున్న సమయంలో బెంగళూరు నుంచి కోవై వైపు వెళ్తున్న కారు వాకింగ్ చేస్తున్న ఇద్దరిపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో శ్వేతా భాను, సమీర్ ఘటనా స్థలంలోనే మృతిచెందగా, కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై సూలగిరి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

210 స్థానాల్లో గెలుస్తాం

● ధర్మపురి రోడ్‌షోలో ఈపీఎస్


రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రజల అండదండలతో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో 210 స్థానాల్లో ఘన విజయం సాధించి అధికారం చేపడతామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధీమా వ్యక్తం చేశారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈపీఎస్ చేపట్టిన ప్రచారయాత్ర శుక్రవారం ధర్మపురి నియోజకవర్గానికి చేరుకుంది. ఈపీఎస్‌కు రోడ్డు పొడవునా ఎన్డీయే కూటమి తరుపున స్వాగతం పలుకుతూ, ఫ్లెక్సీలు, బ్యానర్లు, తోరణాలు ఏర్పాటు చేశారు. ఇందులో విశేషమేమిటంటే పాలక్కోడు ప్రాంతంలో ఈపీఎస్‌ను స్వాగతిస్తూ టీవీకే యువజన విభాగం కారిమంగళం ఆర్గనైజర్ టి.సెల్వం ఏర్పాటు చేసిన బ్యానర్ అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఆయన రోడ్‌షోలో పాల్గొని కరూర్ మృతులకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ, డీఎంకే ప్రభుత్వం ప్రజలకు రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని, ప్రతిపక్షాల బహిరంగ సభలు, రోడ్‌షోలు, ఊరేగింపు, ర్యాలీ తదితర కార్యక్రమాలకు పోలీస్ భద్రత ఏర్పాటు చేయాలని, అయితే కరూర్‌లో భద్రతా ఏర్పాట్లు అంతంత మాత్రమే కావడంతో తొక్కిసలాటకు దారితీసి, 41 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అధికారాన్ని తమ చేతుల్లో ఉంచుకున్న డీఎంకే ఇతరులపై నిందమోపడం సరికాదని, ఇకనైనా బహిరంగ సభలకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంగా బాటిల్‌కు రూ.10 పాట వింటుంటే మాజీమంత్రి సెందిల్‌బాలాజీ ఎందుకు ఆందోళనకు గురవుతున్నారో అర్థం కావడం లేదని, కరూర్ ఘటన తర్వాత ఆయన మాటల్లో స్పష్టతలేదన్నారు. డీఎంకే కూటమిలో భాగస్వామ్యం వహిస్తున్న పార్టీలు కరూర్ ఘటనపై అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, డీపీఐ నేత తిరుమావళవన్ మనస్సాక్షిలేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డీఎంకేకు రెండుసార్లు కరూర్ సమీపంలో ఉన్న రౌంటానాలో బహిరంగ సభ జరుపుకునేందుకు అనుమతులిచ్చామని, ఆ స్థలాన్ని ఈ ప్రభుత్వం ప్రతిపక్షాల సభలకు కేటాయించడంలేదని మండిపడ్డారు. ధర్మపురి జిల్లాలో అన్నాడీఎంకే ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు, శేషంపట్టి నుంచి ధర్మపురి వరకు అవుటర్ రింగురోడ్డు ఏర్పాటు చేశామని, అయితే ఈ నాలుగున్నరేళ్ల డీఎంకే పాలనలో జిల్లాకు చెప్పుదగ్గస్థాయిలో పథకాలు తీసుకురాకపోగా, అన్నాడీఎంకే పథకాలను పక్కనబెట్టారని ఈపీఎస్ ధ్వజమెత్తారు.


టీవీకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యానర్

రాజకీయాల్లో నెగ్గుకు రావడం

అంత సులభం కాదు

● స్పీకర్ అప్పావు


మీడియాతో మాట్లాడుతున్న స్పీకర్

ప్యారీస్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): వెండితెరపై నటించినంతగా రాజకీయాల్లో నటించడం సులభం కాదని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌ను ఉద్దేశించి అసెంబ్లీ స్పీకర్ అప్పావు వ్యాఖ్యానించారు. తిరునల్వేలిలో శుక్రవారం డీఎంకే కూటమి నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, కరూర్‌లో గత శనివారం 19 అడుగుల వెడల్పు రోడ్డులో 12 అడుగుల వెడల్పు కలిగిన వాహనంలో నిల్చుని విజయ్ రోడ్‌షో నిర్వహించడం వల్లే తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు గాల్లో కలిశాయని, దీనికి ఆయనే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విజయ్ ఏడు నిమిషాల షూటింగ్ ముగించుకుని ప్రాణాలు కోల్పోయిన వారి గురించి పట్టించుకోకుండా వెంటనే ప్రత్యేక విమానంలో చెన్నైకి పారిపోయారని, అయితే ముఖ్యమంత్రి స్టాలిన్ కరూర్ దుర్ఘటన సమాచారం తెలిసిన వెంటనే రాత్రికి రాత్రే కరూర్ వెళ్లి బాధితులను పరామర్శించి ఓదార్చారని, మృతులకు అంజలి ఘటించారని, అక్కడే ఉండి సంబంధిత శాఖ మంత్రులు, అధికారులతో జాప్యం లేకుండా సహాయ కార్యక్రమాలు చేయించారన్నారు. తన రోడ్‌షోలో తొక్కిసలాటలో మృతిచెందిన వారి బంధువులను, క్షతగాత్రులను పరామర్శించకుండా వెళ్లిన విజయ్ రాజకీయ అజ్ఞాని అని, ఆయనకు ఆర్ఎస్ఎస్, బీజేపీ పెద్దల అండదండలున్నాయని స్పీకర్ విమర్శించారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా కేకే నగర్ పరిధిలోని శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... అశోక్ నగర్, ఎంజీఆర్ నగర్, ఈకాట్టుతాంగళ్, కలైమగళ్ నగర్, బాలఘని నగర్, విశాలాక్షి నగర్, వెస్ట్ మాంబళం, బృందావన్ ఎక్స్‌టెన్షన్, నక్కీరన్ వీధి, జాఫర్‌ఖాన్‌పేట, వెస్ట్ కేకే నగర్, నెసపాక్కం, వడపళని తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. మరమ్మతుల అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించనున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది.

తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో రానున్న పౌర్ణమి గిరి ప్రదక్షిణ అనుకూల సమయాలను ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ నెల పౌర్ణమి ఘడియలు 6వ తేది మధ్యాహ్నం 12.23 గంటలకు ప్రారంభమై 7వ తేది ఉదయం 9.16 గంటల వరకు ఉంటుందని, ఈ సమయం గిరి ప్రదక్షిణకు అనుకూలమని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

7 నుంచి 'ఏరోడిఫ్‌కాన్- 25'

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 7 నుంచి 9వ తేది వరకు ఏరోస్పేస్, రక్షణ పరిశ్రమల కంపెనీల మహానాడు జరుగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే పదేళ్లలో ఏరోస్పేస్, రక్షణ రంగాల పరిశ్రమల ద్వారా రూ.75వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన తమిళనాడు పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (టిడ్కో) 7 నుంచి 9 వరకు నగరంలో 'ఏరోడిఫ్‌కాన్ 25' పేరుతో మహానాడు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ ప్రత్యేక బస్సుల్లో 6.91 లక్షల మంది ప్రయాణం

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆయుధపూజ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర రోడ్డు ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) గత నెల 30వ తేది వరకు నడిపిన 13,303 ప్రత్యేక బస్సుల్లో 6.91 లక్షల మంది ప్రయాణించారు. వారాంతపు సెలవులు, పండుగ రోజుల్లో పొరుగు ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రజలు స్వగ్రామాలకు వెళ్లేందుకు వీలుగా ఎస్ఈటీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఆ ప్రకారం, గత 30వ తేది వరకు నడిపిన 13,303 బస్సుల్లో 6,91,757 మంది ప్రయాణించినట్లు అధికారులు తెలిపారు.

ఉచిత యోగా తరగతులు

పెరంబూర్, అక్టోరు 3 (ఆంధ్రజ్యోతి): సత్య యోగ సెంటర్ ఆధ్వర్యంలో నాలుగు వారాల ఉచిత యోగా తరగతులు నిర్వహించనున్నారు. నంగనల్లూర్‌లో ఈ నెల 8వ తేది, వేళచ్చేరిలో 9, కేకే నగర్‌లో 10వ తేది తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు సెంటర్ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో... నంగనల్లూర్ లక్ష్మీ నగర్ మెయిన్ రోడ్డులో ఉన్న సుదర్శన్ టెర్రస్ హాల్, వేళచ్చేరి తిరువీధి అమ్మన్ ఆలయ వీధిలోని తిరువీధి అమ్మన్ ఆలయం, కేకే నగర్ పొన్నాంబళం రోడ్డు సప్త సంగమం అయ్యప్పన్, గోపాల కృష్ణన్ ఆలయంలో తరగతులు జరుగనున్నాయి. ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు (సోమవారం నుంచి శనివారం వరకు) జరిగే తరగతుల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు నంగనల్లూర్ (9841227709, 9445051015), వేళచ్చేరి (8754499334), కేకే నగర్ (6383008358) నెంబర్లకు సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

రేపు శ్రీనివాస తిరుకల్యాణ వైభవం

ప్యారీస్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు పటేల్‌రోడ్డులో ఉన్న 'ఆనంద నిలయం' వేంకటేశ్వర భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస తిరుకల్యాణ వైభవం జరగనుంది. ఆనంద వేలు వీధిలోని కల్కిరంగనాథన్ హైయ్యర్ సెకండరీ పాఠశాల ప్రాంగణంలో ఉదయం 8.30 నుండి 10 గంటలలోపు తిరుమంజనం. 10.30 నుండి 11.45 గంటల వరకు కాశీయాత్ర, మాలమార్పిడి, ఊంజల్, నృత్యకార్యక్రమాలు ఉంటాయి. 11.55 గంటలకు మాంగళ్యధారణ, సమర్పణ, సాయంత్రం 4 గంటలకు పట్టణ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహిస్తారు. శనివారం సాయంత్రం 5గంటలకు పెరంబూరు మీనాక్షివీధిలోని అన్నదాన సమాజంలో దీప పూజ, 6.30 గంటలకు వరుడి ఆహ్వానం అనంతరం గరుడ వాహనంపై శ్రీవారు ఊరేగింపుగా కల్యాణ వేదిక ప్రాంగణానికి బయలుదేరుతారు. ఈ రెండు కార్యక్రమాలను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 7 గంటలకు శ్రవణ తిరుమంజనం, పురటాసి శ్రవణం, విశేష పుష్పాలంకారం, ఊంజల్ సేవలను నిర్వహించారు. రేపు జరగనున్న శ్రీవారి కల్యాణోత్సవానికి భక్తులందరూ పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి ఆశీసులు పొందాల్సిందిగా సమాజం అధ్యక్షులు తమ్మినేని బాబు, కమిటీ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

శ్రీలంక నుంచి నగరానికి చేరుకున్న జాలర్లు

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్ల నుంచి విడుదలైన రామేశ్వరానికి చెందిన 15 మంది జాలర్లు నగరానికి చేరుకున్నారు. సరిహద్దులు దాటారంటూ రామేశ్వరానికి చెందిన 15 మంది జాలర్లను అరెస్ట్ చేసిన శ్రీలంక నావికాదళం వారిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించింది. జాలర్లను విడుదల చేయాలని ఆ దేశ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేయడంతో, జాలర్లను శ్రీలంకలోని భారత దౌత్య కార్యాలయానికి అప్పగించారు. ఈ క్రమంలో, శ్రీలంక నుంచి విమానం ద్వారా జాలర్లు నగరానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు జాలర్లకు స్వాగతం పలికి, వారిని ప్రభుత్వం ఏర్పాటుచేసిన వాహనాల్లో స్వగ్రామాలకు తరలించారు.

అగరుబత్తీల కర్మాగారంలో అగ్నిప్రమాదం

- రూ.10 కోట్ల ఆస్తి నష్టం

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అగరుబత్తీ కర్మాగారంలో ఏర్పడిన భారీ అగ్నిప్రమాదంలో సుమారు రూ.10 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించింది. తిరువళ్లూర్ జిల్లా ఎర్నాకుప్పం ప్రాంతంలో అగరుబత్తీల కర్మాగారం ఉంది. ఈ కర్మాగారంలో సుమారు 300 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ కర్మాగారంలో అగరుబత్తీ, సాంబ్రాణి తయారు చేసి ఇతర జిల్లాలకు సరఫరా స్తుంటారు. ఆయుధ పూజ, విజయ దశమి సందర్భంగా కర్మాగారానికి రెండు రోజులు సెలవు ప్రకటించారు. ఈ క్రమంలో, గురువారం సాయంత్రం కర్మాగారంలో దట్టమైన పొగలు, మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు, అగ్నిమాపక శాఖకు తెలియజేశారు. సమాచారం అందుకున్న తేర్వాయ్ సిప్కాట్ అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేసేందుకు శ్రమించారు. మంటలు విస్తరించడంతో, పొన్నేరి, కండిగై, తిరువళ్లూర్ తదితర ప్రాంతాల నుంచి ఫైరింజన్లలో సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ ఘటనలో సుమారు రూ.10 కోట్ల ఆస్తి నష్టం సంభవించిందని సమాచారం. ఈ ఘటనపై పెరియపాళయం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



కర్మాగారం నుంచి దట్టంగా వ్యాపిస్తున్న పొగ

రూ.20 లంచం ఇచ్చిన వ్యక్తి 13 ఏళ్ల తర్వాత విడుదల

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): న్యాయమూర్తి ముందు కోర్టు ఉద్యోగికి రూ.20 లంచం అందించిన కేసులో, 13 ఏళ్ల అనంతరం ఓ వ్యక్తి విడుదలయ్యాడు. తిరునల్వేలి జిల్లా కలక్కాడుకు చెందిన మురుగన్ 2012 జూన్‌లో ఓ కేసులో నాంగునేరి క్రిమినల్ మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరయ్యాడు. అనంతరం కోర్టు గుమస్తా మారియప్పన్‌కు రూ.20 ఇచ్చి ఒక కాపీ తీసుకున్నాడు. ఈ వ్యవహారం గమనించిన న్యాయమూర్తి సుందరరాజ్, మురుగన్ లంచంగా అందజేసిన రెండు 10 రూపాయల నోట్లు స్వాధీనం చేసుకుని, ఫిర్యాదు చేయడంతో పోలీసులు, మురుగన్, మారియప్పన్‌లపై కేసు నమోదుచేశారు. 2019లో ఈ కేసు ఏసీబీ విచారణకు మార్పు చేశారు. అవినీతి కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో ఈ కేసు విచారణ సాగుతుండగా, 2023లో మారియప్పన్ మృతిచెందాడు. ఈ కేసు నుంచి తనను విడుదల చేయాలని మురుగన్ దాఖలుచేసిన పిటిషన్ విచారించిన న్యాయమూర్తి ఆర్.సుబ్బయ్య... ఛార్జిషీటులో నిందితుడు ఉద్దేశపూర్వకంగా రూ.20 ఇచ్చాడని ఎటువంటి ఆధారాలు లేవన్నారు. అతను చట్టపరంగా నకలు పొందేందుకు ఫీజుగా, రూ.20 చెల్లించి ఉండవచ్చు. మురుగన్ నేరం నిరూపించడానికి తగిన ఆధారాలు లేవంటూ, మురుగన్‌ను విడుదల చేస్తూ తీర్పు వెలువరించారు.

గత నెలలో రూ.6.25 కోట్ల జరిమానా

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణ రైల్వే మండల పరిధిలో గత సెప్టెంబరులో రైలు బోగీల్లో తనిఖీ చేసి రూ.6.25 కోట్ల జరిమానా వసూలు చేశారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... దక్షిణ రైల్వే పరిధిలో నడుస్తున్న రైళ్లలో ప్రజలు సౌకర్యవంతమైన ప్రయాణం చేసేలా చర్యలు చేపట్టామని, రైల్వే నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధిస్తున్నామని తెలిపింది. ఆ ప్రకారం, రైళ్లలో టిక్కెట్ లేకుండా ప్రయాణించడం, రిజర్వేషన్ బోగీల్లో సాధారణ టిక్కెట్టుతో ప్రయాణం, అనుమతించిన లగేజీ కన్నా అధికంగా తీసుకెళ్తున్న వారిని గుర్తించేలా తనిఖీలు చేపట్టామని తెలిపింది. ఆ ప్రకారం, దక్షిణ రైల్వే మండం పరిధిలోని చెన్నై, తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, పాలక్కాడు, సేలం తదితర ఐదు ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో చేపట్టిన తనిఖీల్లో, నిబంధనలు అతిక్రమించి ప్రయాణిస్తున్న వారిపై 1,21,189 మందిపై కేసు నమోదుచేసి రూ.6.25 కోట్లు జరిమానాగా వసూలుచేశామని, ఇప్పటివరకు విధించిన జరిమానాలో ఇదే అత్యధికమని దక్షిణ రైల్వే తెలిపింది.

పూజారి చేతిలో భక్తుల కొరడా దెబ్బలు

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా వెల్లంపట్టిలో అచ్చప్పన్ ఆలయంలో ప్రతి ఏటా విజయ దశమి రోజున మహిళలు కొరడాలతో కొట్టించుకునే వేడుకలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ఈ ఏడాది విజయ దశమి రోజైన గురువారం జరిగిన వేడుకల్లో తిరుచ్చి, సేలం, నామక్కల్, కరూర్, పెరంబలూరు జిల్లాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా ఆలయంలోని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అలంకరించిన ఉత్సవమూర్తులను సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లారు. ఆలయ పరిచారకులు, పూజారులు సాంప్రదాయ నృత్యం చేశారు. అనంతరం మహిళలు చేతులు పైకెత్తి మోకాళ్లపై కూర్చోగా, పూజారి కొరడాతో కొట్టారు. కొరడా దెబ్బల అనంతరం మహిళలు ఆలయానికి వెళ్లి, ముఖాలపై తీర్థం చల్లుకుని, విభూది ప్రసాదం తీసుకున్నారు. పూజారి నుంచి కొరడా దెబ్బలు తినడం ద్వారా మంత్ర విద్య, చేతబడి తదితర బారిన పడకుండా కాపాడుకోవచ్చని భక్తులు నమ్ముతారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



మహిళలను కొరడాతో కొడుతున్న పూజారి

శ్మశానంలో గంజాయి విక్రయం.. నలుగురి అరెస్టు

అడయార్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కన్నగి నగర్‌లో శ్మశానంలో గంజాయి విక్రయించిన నలుగురిని నగర పోలీసులు అరెస్టు చేశారు. కన్నగి నగర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్టు గురువారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. దీంతో మఫ్టీలో నిఘా వేసిన పోలీసులకు కన్నగి నగర్ శ్మశానవాటికలో గంజాయి విక్రయిస్తుండగా, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 2.200 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిని కన్నగి నగర్‌కు చెందిన తమిళరసన్ (34), ప్రభాకరన్ (30), దినేష్ (27), మహారాజా (32) అనే వారిగా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి గంజాయి సేకరించి నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు విచారణలో వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

క్రైస్తవం మతంకాదు.. జీవన విధానం

- ఎంసీటీబీసీ కాపరి రాజేంద్రప్రసాద్



సాపాటి రాజేంద్రప్రసాద్-దానమ్మ దంపతులను సత్కరిస్తున్న భాస్కర్, రమేష్‌లు

ప్యారీస్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవం అనేది మతంకాదు.. జీవన విధానం అని మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి (ఎంసీటీబీసీ)కాపరి రెవ.డా.ఎస్ రాజేంద్రప్రసాద్ వివరించారు. వెపేరి హైరోడ్డులో ఆంగ్లేయుల హయాంలో తెలుగు క్రైస్తవుల కోసం ఏర్పాటైన ఎంసీటీబీసీ 147 యేళ్లకు పైగా సామాజిక, ఆధ్యాత్మిక, విద్యారంగాలకు ఎనలేని సేవలందిస్తోంది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ చర్చి కాపరిగా 31యేళ్ల క్రితం బాధ్యతలు స్వీకరించిన రాజేంద్రప్రసాద్ ప్రస్తుతం 32వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 గురువారం చర్చి ప్రాంగణంలో సాపాటి రాజేంద్రప్రసాద్-దానమ్మ దంపతులను సంఘం తరుపున ప్రొటెర్న్ చైర్మెన్ ఎ.భాస్కర్, రికార్డింగ్ కార్యదర్శి శేషం రమేష్, సంఘ సభ్యులు, నిర్వాహకులు కలిసి ఘనంగా సత్కరించారు.

సీఎంను దూషించిన కేసులో టీవీకే కార్యకర్త అరెస్టు

అడయార్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్‌ను దూషించిన టీవీకే కార్యకర్తను పోలీసులు అరెస్టు చేశారు. వలసరవాక్కం, ఆళ్వార్ తిరునగర్‌కు చెందిన గోకుల్ అనే విజయ్ వీరాభిమాని టీవీకే కార్యకర్తగా ఉన్నాడు. అయితే, ధనుష్ హీరోగా నటించిన 'ఇడ్లీ కడై' సినిమా విడుదల సందర్భంగా యూట్యూబర్లు కోయంబేడులోని ఓ థియేటర్ వద్ద ప్రేక్షకులు అభిప్రాయాన్ని తీసుకుంటుండగా, అక్కడకు వచ్చిన గోకుల్... యూట్యూబర్ నుంచి బలవంతంగా మైక్ లాక్కొని... నేను విజయ్ వీరాభిమానిని. టీవీకే కార్యకర్తను. కరూర్ దుర్ఘటనలో తమ పార్టీపై అసత్య ప్రచారం చేస్తున్నారు. నా ఇల్లు మదురవాయిల్‌లో ఉంది. దమ్ముంటే నన్ను అరెస్టు చేసి చూడండి' అంటూ సవాల్ విసురుతూ, సీఎంను అసభ్య పదజాలంతో దూషించారు. ఈ వీడియో వైరల్ కావడంతో డీఎంకే కార్యకర్తలు కోయంబేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, గోకుల్‌ను అరెస్టు చేశారు.

వెల్లయన్‌గిరి ఆలయంలోకి ఏనుగు పరుగులు తీసిన భక్తులు

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పశ్చిమ కనుమల్లోని కొండ శిఖరంలో పూండి వెళ్లయన్ గిరి స్వామి ఆలయం ఉంది. దిగువ నుంచి ఏడో కొండపై వెలసిన స్వయంభువుగా అవతరించిన శివుడిని భక్తులు దర్శించుకునేందుకు ప్రతి ఏడాది ఫ్రిబవరి నుంచి మే వరకు అటవీ శాఖ అనుమతిస్తుంది. ఆ ప్రకారం, స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహిస్తుంటారు. అన్నదానం అనంతరం మిగిలిన ఆహార పదార్థాలను అక్కడే పడేస్తుంటారు. దీంతో, అడవి నుంచి ఏనుగులు ఆలయ ప్రాంగణంలోని ఆహార పదార్థాలు తినేందుకు వచ్చి, సమీపంలోని దుకాణాలను ధ్వంసం చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం హఠాత్తుగా అడవి ఏనుగు ఆలయ ప్రాంగణంలో ప్రవేశించింది. అది చూసిన భక్తులు భయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. భక్తులను ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా ఏనుగు, కొద్దిసేపు ఆలయ ప్రాంగణంలో సంచరించి వచ్చిన మార్గంలోనే వెళ్లిపోయింది. దీంతో, ఏనుగు మళ్లీ ఆలయ ప్రాంగణంలోకి రాకుండా అటవీ శాఖ సిబ్బంది పహారా కాయడంతో పాటు భక్తులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు.



తాగునీటి కోసం నిరసన

తిరుత్తణి, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మహిళలు శుక్రవారం నిరసన చేపట్టారు. తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలోని తళవేసు పంచాయతీ పరిధిలోని అరుంధతీయపురానికి రెండు నెలలుగా తాగునీటి సరఫరా లేదని అధికారులకు విన్నవించుకున్నా.. ఫలితం లేకపోవడంతో శుక్రవారం ఉదయం తిరువలంగాడులోని నీటివనరులశాఖ కార్యాలయానికి ఖాళీ బిందెలతో చేరుకున్న మహిళలు నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న నీటివనరులశాఖ అధికారులు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామన్న హామీతో మహిళలు నిరసన విరమించుకున్నారు.



ప్రభుత్వ ఉద్యోగులకు 25 శాతం దీపావళి బోనస్ ఇవ్వాలి

- పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

ప్యారీస్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రవాణా, ఇతర శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 25శాతం బోనస్ ఇవ్వాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో, రాష్ట్రంలో 2004వ సంవత్సరం నుంచి గరిష్టంగా ప్రభుత్వ ఉద్యోగులకు 20శాతం మాత్రమే దీపావళి బోనస్ ఇస్తున్నారని, ఈ ఏడాది దీనిని 25శాతం పెంచాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

మహిళపై 'బాక్సర్' జాతి శునకం దాడి

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభిరామపురంలో మహిళపై 'బాక్సర్' జాతి శునకం దాడిచేసింది. అభిరామపురం కుట్టి గ్రామణి ప్రాంతంలోని ఇంట్లో పనిచేస్తున్న ఉషా, శుక్రవారం ఉదయం యథావిధిగా నడుచుకుంటూ వెళుతోంది. ఆ సమయంలో, ఆ ప్రాంతంలో ఉన్న శునకం ఉషాపై దాడిచేసింది. ఉషా కింద పడిపోగా, ఆమెపై శునకం దాడిచేసింది. చుట్టుపక్కల వారు శునకాన్ని తరిమివేసి, ఉషను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ వ్యవహారంపై అభిరామపురం పోలీసులు కేసు నమోదుచేసి ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ పరిశీలించారు. ఉషా పనిచేస్తున్న ఇంటి పక్కనే ఉన్న కుమార్ అనే వ్యక్తి పెంచుతున్న 'బాక్సర్' జాతికి శునకం ఆమెపై దాడిచేసినట్లు గుర్తించారు.

ఆర్ఎస్ఎస్ సేవలు తెలుసుకోండి...!

- సీఎం స్టాలిన్‌కు కేంద్ర మంత్రి సూచన

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ సేవలను ముఖ్యమంత్రి స్టాలిన్ తెలుసుకోవాలని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ సూచించారు. నగరంలో గురువారం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఆర్ఎస్ఎస్ సహకారం ఏమిటీ, ఈ దేశానికి నిర్మించేందుకు అది ఎలాంటి త్యాగాలు చేసిందో తెలుసుకోవాలన్నారు. ఆయన కోరితే, తన దగ్గర ఉన్న పుస్తకం పంపుతానని, దానిని చదివి తెలుసుకోవాలని సూచించారు. టీవీకే నేత విజయ్ పెద్ద ఇబ్బందుల్లో ఉన్నారని, ఈ సమయంలో రాజకీయాలు గురించి మాట్లాడేందుకు ఇష్టం లేదన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్, విదేశాలకు వెళ్లినప్పుడల్లా ప్రధాని నరేంద్ర మోదీని విమర్శిస్తుంటారని, ప్రపంచమే అభిమానిస్తున్న ప్రధాని మోదీ గురించి రాహుల్ మాట్లాడడాన్ని ఆ దేశాల నేతలే తప్పుపడుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు.

రాజరాజేశ్వరి దేవికి సామూహిక కుంకుమార్చన

ప్యారీస్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని కలపాచారి వీధిలో ఉన్న ఆర్యవైశ్య తెలుగు బేరి వైశ్యసభ (ఏవీటీబీవీఎస్)ఆధ్వర్యంలో ఆయుధపూజ, విజయదశమి సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. అన్నాడిచెట్టి అంకమ్మరత్నంచెట్టి సదన్‌లో దుర్గాదేవి ప్రతిష్ఠ, కలశస్థాపన, హోమం అనంతరం 108 మంది ముత్తైదువులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.



ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు నిందితుడు రౌడీ నాగేంద్రన్‌కు 'స్టాన్లీ'లో చికిత్స

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీఎస్పీ మాజీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో నిందితుడు, రౌడీ నాగేంద్రన్‌కు స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో చికిత్స అందిస్తున్న పోలీసులు ప్రకటించారు. నాగేంద్రన్ హత్యకు గురైనట్లు సోషల్ మీడియాలో వచ్చిన పుకార్లను పోలీసులు ఖండిస్తూ పోలీసులు ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. నాగేంద్రన్ కాలేయం దెబ్బతినటంతో సెప్టెంబరు 13 నుంచి తీవ్ర అస్వస్థతకు గురైనట్లు పేర్కొన్నారు.

విజయ్‌కు రాహుల్ గాంధీ ఫోన్ చేయడానికి రాజకీయ రంగు పూయొద్దు

- ఎంపీ జ్యోతిమణి



చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కరూరు దుర్ఘటనకు సంబంధించి కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ టీవీకే నేత విజయ్‌కి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్న వ్యవహారానికి రాజకీయ రంగు పులమద్దని కరూరు ఎంపీ జ్యోతిమణి అన్నారు. కరూరులో ప్రాణాలు కోల్పోయిన దిండుగల్‌కు చెందిన ముగ్గురి కుటుంబాలకు శుక్రవారం ఆమె కాంగ్రెస్ తరపున ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ కరూరులో కళ్లెదుటే తొక్కిసలాట జరిగిన పట్టించుకోకుండా వెళ్లిన టీవీకే నేత విజయ్ త్వరలో తాను చేసిన తప్పు ఎలాంటిదో అర్థం చేసుకోగలుగుతారన్నారు. ప్రస్తుతానికి కరూరు దుర్ఘటనపై ఎలాంటి విమర్శలు చేయాల్సిన అవసరం లేదని, అదే సమయంలో సోషల్ మీడియాలో కాంగ్రెస్, టీవీకేతో దోస్తీకడుతోందన్న పుకార్లను పట్టించుకోవద్దని ఆమె పార్టీ శ్రేణులకు హితవు పలికారు.

దుర్గాదేవిగా కొల్లాపురియమ్మన్

తిరుత్తణి, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో కొలువైన కొల్లాపురియమ్మన్ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు జయకృష్ణన్, ఉభయకర్తలు గోపాల్, సులోచన, పవన్, జయప్రసాద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యా హక్కు చట్టం నిధుల విడుదల

- ఉచిత అడ్మిషన్లు ప్రారంభం

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నిర్బంధ విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడంతో, రాష్ట్రంలో ఉచిత అడ్మిషన్లు ప్రారంభించినట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. జాతీయ విద్యా విధానం, పీఎం శ్రీ పాఠశాల విధానాన్ని తమిళనాడు ఆమోదించకపోవడంతో, రాష్ట్రానికి అందించాల్సిన విద్యా హక్కు చట్టం నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టడానికి ముందే, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించేలా నిర్బంధ విద్యా హక్కు చట్టం అమలవుతోందని, ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం పేద విద్యార్థులకు శాపంగా మారిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటూ, నిధులు అందించాలంటూ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పిటిషన్లు వేసింది. ఈ పిటిషన్లు విచారణలో ఉన్న సమయంలో, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి విద్యా హక్కు చట్టం విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ విషయమై, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ చంద్ర మోహన్ విడుదల చేసిన ప్రకటనలో.... ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరానికి ఆర్టీఏ చట్టం ప్రకారం, ఎల్కేజీ, ఒకటవ తరగతిలో మైనార్టీయేతర ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవచ్చు. నిరాశ్రయులు, హెచ్ఐవీ బాధితులు, లింగ మార్పిడి వ్యక్తులు, పారిశుధ్య కార్మికులు, దివ్యాంగుల పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. కేటాయించిన సీట్ల కంటే అధికంగా దరఖాస్తులు అందితే లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయనున్నామన్నారు. తల్లిదండ్రులు తగిన సర్టిఫికెట్లతో ఈ నెల 6వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన వారి వివరాలు ఈ నెల 10వ తేది విడుదల చేస్తామన్నారు. అదనపు దరఖాస్తులు అందితే 16వ తేది లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు rteadmission@tnschools.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 14417 అనే నెంబరు సంప్రదించవచ్చని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ప్రకటనలో తెలిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్యారీస్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కంలోని గాడ్స్‌లవ్ టూ ది నీడి సోషియల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకుని క్యాన్సర్ బాధితుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సింగారం పిళ్లై పాఠశాల, క్రాస్ బ్లడ్ ఫౌండేషన్, విహెచ్‌ఎస్ బ్లడ్ సెంటర్, ఎస్‌కేడీటీ పాఠశాల ఎన్ఎస్ఎస్ విభాగాల సహకారంతో తిరువేర్కాడు ఎస్‌కేడీజే పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ మెగా రక్తదాన శిబిరాన్ని తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) వ్యవస్థాపకులు డా.గొల్లపల్లి ఇశ్రాయేలు ప్రారంభించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు ఊటుకూరు దేవదానం, వీడీ సామ్యూల్, కె.వైద్యనాథన్, ఎస్.ఎడ్రాజ్‌లతో పాటు 62 మంది రక్త దాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న గొల్లపల్లి ఇశ్రాయేలు

గీతా భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో



రక్తదానం చేస్తున్న సభ్యులు

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గీతా భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గోపాలపురంలోని గీతా భవన్ హాలులో నిర్వహించిన శిబిరాన్ని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మనుగోయల్ ప్రారంభించారు. ఆరోగ్య భారతి తమిళనాడు, ఎగ్మూర్ ప్రభుత్వ మహిళలు, పిల్లల ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 57 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా మనుగోయల్ మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శిబిరం ఏర్పాట్లను ట్రస్టీలు కేకే గుప్తా, రాకేష్ గోయల్, శివకుమార్ గోయంకా, మనోహర్‌లాల్ బగారియా, డా.హరిహరన్, డా.సచిన్, డా.ఇళవరసన్, పి.సంతానకృష్ణన్ తదితరులు పర్యవేక్షించారు.

మదురై కలెక్టరేట్ ముట్టడి యత్నం

- మాజీ మంత్రి ఉదయ్‌కుమార్ అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా కలెక్టరేట్‌ను శుక్రవారం ఉదయం ముట్టడించేందుకు యత్నించిన అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్ సహా 300 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కళ్లకుడి సమీపంలో తిరుమాళ గ్రామంలో క్వారీ వల్ల చుట్టుపక్కల గ్రామాలకు దుమ్ము, కాలుష్యం వ్యాపిస్తోందని, ఇందువల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, గ్రామస్తులు పలుమార్లు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. అయినా దీనిపై జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ మాజీమంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్ పదిగ్రామాలకు చెందిన ప్రజలు, రైతులతో కలిసి కలెక్టరేట్ ముట్టడికి మదురై రైల్వేస్టేషన్ నుండి ర్యాలీగా బయలుదేరివెళ్లారు. కలెక్టరేట్ ముందు బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉన్న పోలీసులు సుమారు 300 మంది ఆందోళనకారులను అరెస్ట్ చేశారు.



రైతులతో కలిసి ఉదయ్‌కుమార్ నిరసన



‘తలైవర్ తంబి తలైమైయిల్’లో జీవా

జీవా హీరోగా ‘తలైవర్ తంబి తలైమైయిల్’

జీవా హీరోగా ‘తలైవర్ తంబి తలైమైయిల్’ అనే పేరుతో కొత్త చిత్రం తెరకెక్కుతోంది. కన్నన్ రవి (కేఆర్ గ్రూపు) గ్రూపు పతాకంపై కన్నన్ రవి నిర్మాతగా, దీపక్ రవి సహ నిర్మాతగా ఈ మూవీ రూపుదిద్దుకోనుంది. నితీష్ సహదేవ్ దర్శకుడు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ దసరా పండుగ సందర్భంగా రిలీజ్ చేశారు. ప్రేమ, హాస్యం, రొమాన్స్, ఎమోషన్స్ తదితర అంశాల మేళవింపుతో మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించనున్నారు. ఇందులో హీరో జీవాతో పాటు తంబిరామయ్య, ఇళవరసు, ప్రార్థన నాథన్ తదితరులు నటించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం చివరి దశ చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమా ట్రైలర్, ఆడియో త్వరలోనే విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

తండ్రీకొడుకుల కాంబినేషన్‌లో మరో చిత్రం

యువ దర్శకుడు ఉమాపతి, ఆయన తండ్రి, నటుడు తంబి రామయ్య కాంబినేషన్‌లో మరో చిత్రం రానుంది. వీరిద్దరి కాంబోలో ఇప్పటికే ‘రాజా కిలి’ అనే చిత్రం వచ్చిన విషయం తెల్సిందే. ఇపుడు మరోమారు తన కుమారుడు ఉమాపతి దర్శకత్వంలో తంబి రామయ్య ప్రధాన పాత్ర పోషించనున్నారు. కాంతార స్టూడియోస్ సహకారంతో కన్నన్ రవి గ్రూప్స్ ప్రొడక్షన్ నెం.6 అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ మూవీని తెరకెక్కించనుంది. ఈ సినిమా ప్రారంభోత్సవం శుక్రవారం సంప్రదాయ పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. ఇందులో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాక్షలు తెలిపారు. రాజకీయ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో తంబి రామయ్యతో పాటు నట్టి సుబ్రమణ్యం, శ్రిత రావు, చాందిని తమిళరసన్, విజి చంద్రశేఖర్, వడివుక్కరసి, ఇళవరసు, ఎంఎస్ భాస్కర్, కింగ్‌స్లీ, జాన్ విజయ్, ఆడుకలం నరేన్, వీజే ఆండ్రూస్, సత్యన్, సామ్స్, కింగ్ కాంగ్, దేవి మహేష్‌తో పాటు పలువురు నటిస్తున్నారు. ఈ సినిమా కోసం తంబి రామయ్య, నట్టి సుబ్రమణ్యం తొలిసారి కలిసి పనిచేయనున్నారు. ఈ సినిమా గురించి నిర్మాత కన్నన్ మాట్లాడుతూ, ‘పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో హాస్య భరితంగా రూపొందిస్తున్నాం. తంబి రామయ్య, నట్టి, జాతీయ అవార్డు గ్రహీత ఎంఎస్.భాస్కర్ వంటి ఉత్తమ నటీనటులతో కలిసి పనిచేయనుండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దర్శకుడు ఉమాపతి మాట్లాడుతూ, ‘కన్నన్ రవితో కలిసి పనిచేయడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఆయనకు సినిమా అంటే అమితమైన ప్రేమ. ఇది కామెడీ టచ్‌తో వాస్తవిక రాజకీయ అంశాలను తీసుకుని వినోదాత్మకంగా రూపొందిస్తాం. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రీకరణ పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నాం’ అని వివరించారు.



కొత్త చిత్రం ప్రారంభోత్సవ దృశ్యం

చిత్రజ్యోతి

‘మూక్కుత్తి అమ్మన్-2’ ఫస్ట్‌లుక్ రిలీజ్

ప్రముఖ సినీ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వంలో స్టార్ హీరోయిన్ నయనతార ప్రధాన పాత్ర పోషిస్తున్న ‘మూక్కుత్తి అమ్మన్-2’ మూవీ నుంచి ఫస్ట్‌లుక్ విజయదశమి పండుగను పురస్కరించుకుని రిలీజ్ చేయగా, ఆమె ఫ్యాన్స్ సంబరపడిపోతున్నారు. కాగా, ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, అవ్ని సినిమ్యాక్స్, రౌడీ పిక్చర్స్, ఐవీవై ఎంటర్‌టైన్మెంట్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నిర్మాతల్లో ఒకరైన డాక్టర్ ఐసరి కె.గణేష్ మాట్లాడుతూ, ఇది సినిమా కాదు. ప్రజలను ఆకట్టుకునే భక్తిరస చిత్రం. హాస్యాన్ని మిళితం చేసి ప్రేక్షకులకు గొప్ప సినిమాగా అందించడమే మా అందరి లక్ష్యం’ అని పేర్కొన్నారు.



‘మూక్కుత్తి అమ్మన్-2’లో నయనతార

భారతీయ సినిమాకు మరింత ప్రచారం

● అజిత్

కోలీవుడ్ అగ్రహీరో అజిత్ కుమార్ ‘అజిత్ కుమార్ కార్ రేసింగ్’ అనే కంపెనీ స్థాపించి అంతర్జాతీయ కార్ రేసింగ్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో తన కార్ రేసింగ్ కంపెనీ లోగోలో ‘ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ’ అనే పేరు ముద్రించారు. భారతీయ చిత్రపరిశ్రమకు అంతర్జాతీయ వేదికలపై మరింత ప్రచారం కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు అజిత్ వెల్లడించారు. ప్రస్తుతం స్పెయిన్‌లోని బార్సిలోనాలో జరుగుతున్న కార్ రేసింగ్‌లో అజిత్ బృందం పాల్గొంటుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ‘మున్ముందు మరిన్ని కార్ రేసింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ప్రయత్నిస్తాం. ఇందుకోసం క్రీడలు, భారతీయ చలనచిత్ర పరిశ్రమకు ప్రాముఖ్యత ఇచ్చేలా సారూప్యత కలిగిన వ్యక్తులను గుర్తించాలి. ఒక సినిమా ప్రోత్సహించడానికి అనేక మార్గాలున్నాయి. ఇందుకోసం మోటార్ రేసింగ్ పోటీలను ఉపయోగించుకోవాలని భావిస్తున్నాను. ఇలా చేయడం వల్ల అంతర్జాతీయ స్థాయిలో భారీ సంఖ్యలో ప్రేక్షకులను ఆకర్షించవచ్చు. అలాగే, ప్రపంచ వ్యాప్తంగా భారతీయ చిత్రాలకు కూడా ఆదరణ లభించాలని కోరుకుంటున్నాను’ పేర్కొన్నారు.



కార్ రేసింగ్ కంపెనీ లోగో- అజిత్ కుమార్

కాకలూరులో ముగిసిన నవరాత్రి వేడుకలు



దసరా వేడుకల్లో చిన్నారులు, కళాకారులతో నిర్వాహకులు

ప్యారీస్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కాకలూరు మారుతి న్యూటౌన్ శ్రీమన్నారాయణ వీధిలోని సెల్వగణపతి దేవాలయం, రామాలయంలో తృతీయ వార్షిక నవరాత్రి వేడుకలు గురువారం వైభవంగా ముగిశాయి. ఆలయ ప్రాంగణంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేసి కర్ణాటక సంగీతం, శాస్త్రీయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వీరిని ఆలయ నిర్వాహకులతో కలిసి ఆలయ స్థాపకులు వి. శ్రీమన్నారాయణ-సరళ దంపతులు ఘనంగా సత్కరించారు. సామూహిక కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న ముత్తైదువులకు పసుపుకుంకుమ, కన్యపూజ సందర్భంగా బాలికలకు బహుమతులు అందజేశారు.

చదువులతల్లి క్షేత్రంలో ఘనంగా విద్యారంభం పూజలు



ప్రత్యేక పూజలో దంపతులు

ప్యారీస్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని ఆర్యపాక్కం గ్రామంలో అక్షరాభ్యాసతకు ప్రసిద్ధి గాంచిన విద్యారంభ జ్ఞాన సరస్వతి ఆలయంలో నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో రెండవదైన చదువుల తల్లి క్షేత్రంలో విజయదశమి సందర్భంగా అర్చకులచేత తమ పిల్లలకు తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. ఆలయ నిర్వాహకులు గురుస్వామి భక్తవత్సలం, ధర్మకర్త పీవీ.కృష్ణారావు, మణిమాలారావు దంపతులు పిల్లలకు విద్యాసామగ్రి, నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం ఈ ఆలయంలో మొట్టమొదటిసారిగా 50యేళ్లకు పైబడిన దంపతులు ఆయురారోగ్యాలతో ఉండాని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేత్రపర్వంగా నిమిషాంబాళ్ ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న ఆలయ నిర్వాహకులు

ప్యారీస్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేట కాశి చెట్టి వీధిలో ఉన్న నిమిషాంబాళ్ ఆలయంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. నవ రాత్రుల్లో పదో రోజున నిమిషాంబాళ్ అమ్మవారిని వజ్రవైఢూర్యాలు, పట్టువస్త్రాలతో విశేషంగా అలంకరించి గురువారం రాత్రి పురవీధుల్లో ఊరేగించారు. నిమిషాంబాళ్ భక్తజన సభ అధ్యక్షుడు మన్నారు ఉదయ్‌కుమార్, కార్యదర్శులు సీఎస్.శేఖర్, ఇమ్మిడి కిషోర్‌కుమార్, కోశాధికారి సూరిశెట్టి బాలాజీ, ఉపాధ్యక్షులు అమరా బాలా తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. నవరాత్రుల సందర్భంగా భక్తి, నృత్య కార్యక్రమాలు నిర్వహించి కళాకారులను ఘనంగా సత్కరించారు.



శివగంగ జిల్లా ఇలుప్పుకుడిలోని ఇండో-టిబెట్ సరిహద్దు భద్రతా దళం శిక్షణ కేంద్రంలో ఆయుధ పూజ సందర్భంగా గురువారం తుపాకులకు పూజలు నిర్వహిస్తున్న అధికారులు

కీళడి మ్యూజియం చూసి గర్వపడుతున్నా

● ఎక్స్ పేజీలో సీఎం స్టాలిన్

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా కీళడి పురావస్తు తవ్వకాల ప్రాంతాన్ని, అక్కడ తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మ్యూజియంను చూసి తానెంతగానో గర్వపడుతున్నానని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. శుక్రవారం ఆయన ఆ ప్రాంతాన్ని సందర్శించారు. మ్యూజియం తిలకించేందుకు వచ్చిన పర్యాటకులతో ముచ్చటించారు. వారితో కలిసి సెల్ఫీలు కూడా దిగారు. ఈ విషయమై ఆయన ఎక్స్‌పేజీలో ఓ సందేశం వెలువరిస్తూ డీఎంకే ద్రావిడ తరహా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కీళడి మ్యూజియంను గత 30 నెలల్లో సుమారు 12 లక్షల మంది సందర్శించినట్లు తెలుసుకుని ఎంతో సంతోషించానన్నారు. శుక్రవారం ఆ మ్యూజియం సందర్శనకు వెళ్లగా, స్వదేశం నుంచే కాకుండా విదేశాల నుండి కూడా పర్యాటకులు ఆ ప్రాంతాన్ని ఆసక్తిగా గమనించి, అక్కడి సిబ్బందితో ప్రతి విషయం గురించి ప్రత్యేకించి తమిళుల ప్రాచీన నాగరికత గురించి తెలుసుకోవడాన్ని గమనించినట్లు పేర్కొన్నారు. కీళడి ఓపెన్ ఎయిర్ మ్యూజియం జనవరిలో ప్రారంభిస్తామని, పోరునై మ్యూజియం డిసెంబర్‌లో తెరుస్తామని ఆయన తెలిపారు. గంగైకొండ చోళపురం వద్ద మరో మ్యూజియం రాబోతున్నదని ఈ సందర్భంగా స్టాలిన్ పేర్కొన్నారు.





కీళడి పురావస్తు తవ్వకాల ప్రాంతాన్ని గమనిస్తున్న ముఖ్యమంత్రి - కీళడి మ్యూజియం వద్ద విదేశీ సందర్శకులతో సీఎం స్టాలిన్

ఎస్‌కేపీడీలో ఘనంగా పార్వేట ఉత్సవం

ప్యారీస్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్వాల్ బజార్ ఆదియప్పనాయకన్ వీధిలో మూడు శతాబ్దాల చరిత్ర కలిగిన కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో శరన్నవరాత్రులు గతనెల 22న ప్రారంభమై గురువారం రాత్రి అమ్మవారి పార్వేటతో ముగిశాయి. ఆలయ మహామండపంలో ఉదయం 11గంటలకు చండీహోమం, మధ్యాహ్నం 3 గంటలకు సువాసిని పూజ, 4గంటలకు సుమంగళి ప్రసాదం, రాత్రి 8గంటలకు గుండ ప్రవేశం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విజయదశమిని పురస్కరించుకుని గురువారం జమ్మి చెట్టుపూజ, మహిషాసుర మర్దిని అలంకారంలో సింహవాహనంలో రాత్రి 7 గంటలకు విశేషంగా అలంకరించిన రథంలో అమ్మవారి ఊరేగింపు మేళతాళాలు, వేదమంత్రోచ్చారణల మధ్య బయలుదేరి కొత్వాల్ మార్కెట్ పరిసర వీధుల గుండా సాగింది. ఆలయ ధర్మకర్త కొల్లా వెంకట చంద్రశేఖర్, ట్రస్టీలు దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్.సురదర్శనం, టీవీరామకుమార్, సీఆర్.కిశోర్‌బాబు, తాతా బద్రినాథ్, కార్యదర్శి ఎం.కిషోర్‌కుమార్‌లు ఈ 11 రోజుల వేడుకలను పర్యవేక్షించి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు ఉభయదారలు, మాజీట్రస్టీలు, ప్రముఖులను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.



సింహ వాహనంపై విహరిస్తున్న అమ్మవారు

రాజరాజేశ్వరి అలంకారంలో కన్యకా పరమేశ్వరి



తిరుత్తణి, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో కొలువుదీరిన కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు జయకృష్ణన్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు జరిగాయి. అనంతరం మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. చివరగా భక్తులందరికి ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు శెట్టి, సంఘ నిర్వాహకులు పండ్రినాథ శెట్టి, జనార్దన్ శెట్టి, అనిల్‌కుమార్, హేమంత్, వినోద్‌కుమార్, శ్రావణ్‌కుమార్, నాగేంద్రశెట్టి, శేషు, వాసవీ మహిళా మండలి సభ్యులు కమల, కల్పన, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

కరూర్ మృతుల కుటుంబాలకు సీపీఎం బృందం పరామర్శ

పెరంబూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో విజయ్ పర్యటన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలను సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి పరామర్శించారు. కరూర్‌లో గత నెల 27న టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందారు. తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలను కాంగ్రెస్, బీజేపీ సహా పలు పార్టీల నేతలు కలుసుకుని పరామర్శిస్తున్నారు. ఈ క్రమంలో, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, కార్యవర్గ సభ్యులు వాసుకి, కేరళ ఎంపీ రాధాకృష్ణన్, శివదాసన్, దిండుగల్ ఎంపీ సచ్చిదానందం, నాగపట్టణం ఎమ్మెల్యే నాగై మాలి బాధిత కుటుంబాలను కలుసుకుని ఓదార్చారు. తొలుత ఘటన జరిగిన వేలుచామిపురం ప్రాంతాన్ని సందర్శించిన సీపీఎం బృందం, ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారిని కలిసి ఘటన జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రద్దీలో చిక్కుకుని మృతిచెందిన రెండేళ్ల బాలుడు గురువిష్ణు ఇంటికి వెళ్లిన సీపీఎం బృందం, తల్లిదండ్రులను ఓదార్చారు.



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బేబి, వాసుకి తదితరులు

చెన్నై పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్



అడయార్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ దివస్ 2025లో భాగంగా చెన్నై పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 450 మందికిపైగా ఉద్యోగులు పాల్గొన్నారు. అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రీన్ ఫ్యూచర్ కోసం నిర్వహించారు. ఇందులో చెన్నై పోర్ట్ అథారిటీ చైర్‌పర్సన్, కామరాజ్ పోర్ట్ చైర్మన్ సునీల్ పలివాల్ క్లీనింగ్ డ్రైవ్‌కు నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నై పోర్ట్ ట్రస్ట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌సీ సీఎండీకి ‘మహాత్మా అవార్డు’

అడయార్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) సీఎండీ ప్రసన్న కుమార్ మోటుపల్లికి 2025 సంవత్సరానికిగాను ‘మహాత్మా గాంధీ’ అవార్డు వరించింది. బిజినెస్, స్థిరత్వం, సామాజిక ప్రభావంలో నాయకత్వం, వ్యక్తిగత విభాగంలో ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డు వరించింది. ఈ నెల 1వ తేదీ న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేదీ చేతుల మీదుగా ప్రసన్న కుమార్ మోటుపల్లి ఈ అవార్డు అందుకున్నారు. 2016లో ‘సీఎస్ఆర్ మ్యాన్ ఆఫ్ ఇండియా’, ఆదిత్య బిర్లా గ్రూపు సహకారంతో ఈ అవార్డును ప్రతి యేటా అందజేస్తున్నారు. సమాజానికి పరివర్తనాత్మక కృషి చేసే వ్యక్తులు, సంస్థలకు ప్రపంచంలోని అత్యున్నత గౌరవాల్లో ఒకటిగా గుర్తించారు. జాతిపిత మహాత్మా గాంధీ గౌరవార్థం ప్రవేశపెట్టిన ఈ అవార్డు, సత్యం, అహింస, సామాజిక న్యాయం, సమానత్వం, కరుణ, స్థిరత్వం తదితర విలువలకు ప్రతీకగా ఇస్తారు. గతంలో రతన్ టాటా, రాజశ్రీ బిర్లా, అజీమ్ ప్రేమ్‌జీ వంటి దిగ్గజ పారిశ్రామికవేత్తల సహా 500 మందికిపైగా ఈ అవార్డు ప్రదానం చేశారు.



అవార్డు స్వీకరిస్తున్న ప్రసన్నకుమార్ మోటుపల్లి

కరూర్ ఘటనపై నివేదిక వెల్లడించండి

● సీఎంకు బీజేపీ నిజ నిర్ధారణ కమిటీ లేఖ

అడయార్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) రాజకీయ ప్రచార సభలో జరిగిన తొక్కిసలాటపై పూర్తిస్థాయి నివేదికను బహిర్గతం చేయాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు భారతీయ జనతా పార్టీ ఏర్పాటు చేసిన ఎంపీల నిజనిర్ధారణ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ కమిటీ సీఎంకు శుక్రవారం లేఖ రాసింది. టీవీకే అధ్యక్షుడు విజయ్ గత శనివారం కరూర్‌లో చేపట్టిన రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిచెందగా, మరో 110 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కరూర్ ఘటనపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని కేంద్రమాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ నేతృత్వంలో ఎంపీల బృందాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. ఎంపీలు హేమమాలిని, తేజశ్వి సూర్య, బ్రిడ్జ్‌లాల్, శ్రీకాంత్ షిండే (శివసేన), అపరాజిత సారంగి, రేఖాశర్మ, పుట్టా మహేశ్‌కుమార్ (టీడీపీ)తో ఏర్పాటైన ప్రత్యేక బృందం కరూర్‌లో తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చింది. కరూర్‌లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కూడా ఈ ఎంపీల బృందం పరామర్శించింది. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర ఉన్నతాధికారులతో సమావేశమైంది. ఈ కమిటీకి సారథ్య వహించిన ఎంపీ అనురాగ్ ఠాకూర్ సీఎం స్టాలిన్‌కు రాసిన లేఖలో వివరాలిలా ఉన్నాయి. ఎన్‌డీఏ కూటమి తరఫున ఎనిమిది మంది ఎంపీల బృందం తొక్కిసలాట ప్రాంతాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాలను కలుసుకున్నామని, ఈ దుర్ఘటనపై అన్ని వైపుల నుంచి సందేహాలు వస్తున్నాయన్నాని ఆ లేఖలో పేర్కొంది. అయితే, ముఖ్యమంత్రిగా ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించడంతో పాటు ఈ విషాదకర ఘటనకు మూల కారణాలపై వెల్లడించేలా అధికారులను ఆదేశించాలని కోరింది. “కరూర్ దుర్ఘటనకు మూల కారణాలు ఏంటి? ఇంత భారీస్థాయిలో గుమిగూడటానికి కారణమేంటి? ఈ సమావేశం ప్రారంభంకావడానికి ముందు, వెనుక చేపట్టిన ముందస్తు చర్యలు ఏంటి? ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృత్తం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోదలచారు” అని లేఖలో పేర్కొంది. ఈ నివేదికను ప్రజలు కూడా తెలుసుకునేలా విడుదల చేయాలని కోరింది.

కలైవానర్ అరంగంలో జాతీయ చేనేత ప్రదర్శన ప్రారంభం

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక చేపాక్ ప్రాంతంలోని కలైవానర్ అరంగంలో శుక్రవారం ఉదయం జాతీయ చేనేత ప్రదర్శనను రాష్ట్ర చేనేత శాఖ మంత్రి ఆర్.గాంధీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పీకే శేఖర్ బాబు, ఎం.సుబ్రమణ్యం, కార్పొరేషన్ మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేషకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శన 15 రోజులపాటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో కాంచీపురం, దిండివనం, ఆరణి, సేలం, రాశిపురం, తిరుప్పూరు ప్రాంతాల్లో పేరుగాంచిన పట్టు , చేనేత వస్త్రాలు రాయితీ ధరలకు లభిస్తాయని పేర్కొన్నారు. ఇదే విధంగా తిరునల్వేలి, జయంకొండం, మదురై, పరమకుడి, అరుప్పుకోట, తిరుచ్చి, శివగంగ, కోయంబత్తూరు, సేలం పట్టుచీరలు కూడా అమ్మకానికి సిద్ధంగా ఉంచినట్లు వివరించారు.



చేనేత ప్రదర్శన ప్రారంభించి స్టాల్‌లో వస్త్రాలను తిలకిస్తున్న మంత్రులు ఆర్.గాంధీ, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ తదితరులు